క్లుప్తంగా

రోడ్డు నాణ్యత పరిశీలన


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో ఇటీవల నిర్మించిన రోడ్డు పనులను విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. గ్రామంలో వారం రోజుల క్రితం దాదాపు 30 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న రోడ్డును ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి ప్రభుత్వం నుంచి కేటాయించిన నిధులు రూ.5 లక్షలతో మండల పరిషత్ పాఠశాల నుంచి కె.శ్రీనివాసరావు ఇంటి వరకు రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు పనులు పూర్తి చేయటంతో నాణ్యత ప్రమాణాలను విజయవాడ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ శాఖ డెప్యూటీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఏఈ మోజెస్, పీఆర్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సంగెపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉయ్యూరు: డయల్ యువర్ డీఎం కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నామని ఆర్టీసీ ఉయ్యూరు డిపో మేనేజరు కె.ఎస్.ఆర్.కె. ప్రసాద్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో 9959224796 నంబరుకు ఫోన్ చేసి ఆర్టీసీ ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు చెప్పాలని కోరారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన


ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఉయ్యూరు: లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై కళాజాతా బృందం బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కళాజాతా కార్యక్రమం చేపట్టారు. జానపద గీతాలు పాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలను సన్నివేశ రూపంలో వివరించారు. జాతాలో మిరియాల శేఖర్‌బాబు, రమణరావు, ప్రశాంత్‌కుమార్, రవితేజ పాల్గొన్నారు.

తోపుడు బండి వితరణ

ఉయ్యూరు: రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో చిరు వ్యాపారి పద్మకు తోపుడు బండిని బుధవారం వితరణగా అందించారు. రోటరీ ప్రతినిధి చొప్పరపు కొండలు జ్ఞాపకార్థం ఆయన కుమారులు సాయిసందీప్, సాయి సుభాష్‌లు తోపుడు బండిని అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాగసుబ్రమణ్యం, ప్రతినిధులు వసంతరావు, సయ్యద్ అనిస్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

పెనమలూరు: పోరంకి గ్రామంలో యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి సాయిరాం వీధికి చెందిన కె.వెంకటసత్యనారాయణ కుమార్తె (20) ఇంటర్ వరకు చదివి ఇంట్లో ఉంటుంది. వెంకట సత్యనారాయణ భార్యతో శ్రీశైలంకు వెళ్లి తిరిగి 12వ తేదీ సాయంత్రం ఇంటికి వచ్చారు. అయితే అప్పటికే వారి కుమార్తె ఇంటి వద్దలేదు. ఆమె వద్ద ఉన్న ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బ్యాంకు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, గ్రూప్స్‌తో పాటుగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న యువతకు విద్యాదర్శిని పేరుతో ఉచిత శిక్షణను అందజేస్తున్నామని విజన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా బుధవారం నగరంలోని ఆయన కార్యాలయంలో విద్యాదర్శిని వెబ్‌సైట్‌ను ప్రారంభించారని విజయ్‌కుమార్ తెలిపారు. నిరుద్యోగ యువతకు ఈ విధంగా ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని కాంతి రాణా టాటా కొనియాడారన్నారు. ఆసక్తి ఉన్న యువత ఈ నెల 30వ తేదీలోగా విద్యాదర్శిని.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

పచ్చందమే లక్ష్యం

- జిల్లా నీటి యాజమాన్య సంస్థ నిర్వహణ
- 50 వేల మొక్కల పంపిణీకి నిర్ణయం
- వచ్చే జూన్, జూలై నెలల్లో అందించేందుకు ఏర్పాట్లు
- వీరపనేనిగూడెంలో 50 వేల బెడ్లతో వివిధ రకాల మొక్కల పెంపకం


ఏపుగా పెరుగుతున్న నీడనిచ్చే తురాయి మొక్కలు


వీరపనేనిగూడెంలో ఏర్పాటైన డ్వామా నర్సరీ

గన్నవరం రూరల్: పర్యావరణాన్ని రక్షించేందుకు మొక్కలు ఎంతగానో ఉపకరిస్తాయి. భూమిలో తేమ శాతాన్ని కాపాడేందుకు, నీడనిచ్చేందుకు, పక్షులకు ఆలవాలంగా నిలిచేందుకు పచ్చదనం ఎంతో అవసరం. ఈ అవసరాన్ని గుర్తించిన జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డీడబ్ల్యూఎంఏ) గన్నవరం, పెనమలూరు, కంకిపాడు మండలాల్లో మొక్కలు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టింది.

గత సంవత్సరం నుంచి..

గన్నవరం మండలం వీరపనేనిగూడెం జెడ్పీహైస్కూల్ ఆవరణలో నర్సరీని ఏర్పాటు చేశారు. గత 2022 నవంబరు నెలలో ప్రారంభమైన నర్సరీ ఇప్పటికే మునగ మొక్కలు మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పర్యవేక్షణలో నిరంతరం మొక్కల బెడ్లు పర్యవేక్షించటం, విత్తనాలు వేయటం, వాటి మొలక శాతాన్ని గుర్తించటం, మొలకెత్తిన మొక్కలను పెంచి పర్యవేక్షిస్తున్నారు.

50 వేల మొక్కల పంపిణీ లక్ష్యం..

2023 సంవత్సరం జూన్, జూలై నెలల్లో మూడు మండలాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసేందుకు నర్సరీలో మొక్కల పెంపకం కొనసాగుతోంది. ఇక్కడ మొత్తం 50 వేల బెడ్లు ఉన్నాయి. వీటిలో 50 వేల మొక్కలు పెంచుతున్నారు. ఒక్కొక్క లైన్‌లో 1200 నుంచి 1300 మొక్కల బెడ్లను ఏర్పాటు చేశారు. వీరపనేనిగూడెం మట్టి మొక్కల పెంపకానికి ఎంతో అనువైనదని గుర్తించిన డ్వామా అధికారులు ఇక్కడ నర్సరీని ఏర్పాటు చేశారు.

నీడనిచ్చేవి కూడా..

ఉసిరి, నేరేడు, దానిమ్మ, తురాయి, నిమ్మ, సీతాఫలం, చింత, గానుగ, వేప, బాదం, నిద్రగన్నేరు, అడవితంగేడు, వెలగ, మునగ మొక్కల పెంపకం ఇక్కడ కొనసాగుతోంది. ఈ నర్సరీ ద్వారా ఇప్పటికే 5 వేల మునగ మొక్కలు పంపిణీ చేశారు. స్థానిక జెడ్పీహైస్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, ఎంపీపీ పాఠశాల ఆవరణలలో మునగ మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం డ్వామా అధికారులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు సిబ్బంది నర్సరీ పనులు చూస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలతో..

అధికారులు పలుమార్లు పరిశీలన చేసి ఏ ప్రాంతంలో మంచి విత్తనాలు లభిస్తున్నాయో గుర్తించి ఆ విత్తనాలను సేకరిస్తున్నారు. వాటి గుణగణాలు తెలుసుకుని కొనుగోలు చేసి నర్సరీకి అందజేస్తున్నారు. దీంతో నాణ్యమైన మొక్కలు పెంపకం జరుగుతోంది. ఔషధ గుణాలున్న వేప, గానుగ, బాదం, అడవి తంగేడు, వెలగ వంటి మొక్కలు కూడా నర్సరీలో లభిస్తున్నాయి.

పండ్ల మొక్కలు కావాలి



రెండు నెలల క్రితం మునగ మొక్కలు ఇంటింటికీ పంపిణీ చేశారు. వాటిని జాగ్రత్తగా పెంచుతున్నాం. ఇప్పటికే పూత వచ్చింది. మొక్క ఎదుగుదల కోసం పూతను తొలగించి పోషణ చేస్తున్నాం. మరిన్ని ఫలాలనిచ్చే మొక్కలు అందించాలి. ఇలాంటివి మాకు చాలా ఉపయోగపడతాయి.

–ఎస్.భాను, వీరపనేనిగూడెం

మరిన్ని మొక్కలు ఇవ్వాలి..



మునగ మొక్కలు ఏపుగా ఎదుగుతున్నాయి. వచ్చే రెండు నెలల్లో ఎదుగుదల బాగా ఉంటుంది. త్వరగా కాపునకు వస్తున్నాయి. మొక్కలు నాణ్యతగా ఉన్నాయి. మునగ ఆకు, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మరిన్ని మొక్కలు ఇవ్వాలని కోరుతున్నాం.

–డి.కనకమ్మ, వీరపనేనిగూడెం, సుగాలీ కాలనీ

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు


పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాలు తీసుకెళుతున్న సిబ్బంది

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో మొత్తం 15 పరీక్షా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్షలు నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయి. మొదటి రోజు బుధవారం ఇంటర్ మొదటి ఏడాది పరీక్ష జరిగింది. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయి. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాలను కస్టోడియన్‌ల సహకారంతో సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరవేశారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు కాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకుని పరీక్షలు రాశారు.

కంకిపాడు: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. పునాదిపాడు పరిధిలోని శ్రీచైతన్య క్యాంపస్‌లో రెండు, ఈడుపుగల్లులో ఒక పరీక్షా కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. 1977 మంది విద్యార్థులకు 1963 మం హాజరయ్యారు. 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

మూసుకుపోయిన రోడ్డు..

పునాదిపాడు పరిధిలోని శ్రీచైతన్య విద్యా సంస్థల రోడ్డు మార్గంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. అయితే పరీక్షల నిమిత్తం విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులు అడ్డగోలుగా పార్కు చేసిన వాహనాలను పోలీసులు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. పునాదిపాడులోని పరీక్షా కేంద్రానికి వెళ్తున్న ఓ విద్యార్థినిని ఆటో ఢీకొనటంతో గాయపడింది. ఎస్ఐ కె.సుధాకర్ సిబ్బందిని పరీక్షా కేంద్రానికి పంపి ప్రాథమిక వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఘటనపై వివరాలను సేకరిస్తున్నారు.

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాల, గన్నవరంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక శ్రీమల్లిఖార్జున హైస్కూల్‌లో డిగ్రీ ప్రథమ, తృతీయ సంవత్సర విద్యార్థులకు కూడా పరీక్షలు ప్రారంభమయ్యాయి.

నూరుశాతం పన్ను వసూలు చేయండి


గోసాల పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు

పెనమలూరు: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు ఈ నెలాఖరు కల్లా వసూళ్లు పూర్తి చేయాలని ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం గోసాల గ్రామ పంచాయతీలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోసాల గ్రామ పంచాయతీలో ఇళ్ల పన్నులు రూ. 24,65,224 వసూలు చేయాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటివరకు రూ.20,00,000 వసూలు చేశారన్నారు. ఇంకా వసూలు కావల్సిన పన్నులు రూ.4,65,224 ఉందన్నారు. పంచాయతీ ఆదాయం ఏడాదికి రూ.70 లక్షలు ఉందని తెలిపారు. నెలాఖరుకల్లా వంద శాతం పన్నులు అన్ని గ్రామ పంచాయతీలు వసూళ్ల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన


మాట్లాడుతున్న ఈడుపుగల్లు సెక్టార్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి

కంకిపాడు: మానవ అక్రమ రవాణాపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ ఈడుపుగల్లు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణకుమారి అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ (హైదరాబాద్), ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీపై కంకిపాడు జెడ్పీ పాఠశాలలో అవగాహనా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్వర్ణకుమారి మాట్లాడుతూ సైబర్ నేరాలు, చిన్న తనంలో ఏర్పడే వ్యామోహాలతో కలిగే అనర్థాలను వివరించారు. అక్రమ రవాణాతో జరిగే వాణిజ్య పరమైన లైంగిక దోపిడీ, జీవితాలు ఛిద్రం అయ్యే తీరు తెన్నులను వీడియోల రూపంలో విద్యార్థులకు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సమన్వయకర్త వై.చంద్రయ్య అవగాహన కల్పించారు. హెచ్ఎం సుధారాణి, సంస్థ సహాయ సమన్వయకర్తలు శ్రావ్య శృతి, వినోద్‌కుమార్, ఆర్తి ఫౌండేషన్ ప్రతినిధి సుగుణ, ఐసీడీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాణిజ్యపరమైన లైంగిక దోపిడీకు సంబంధించిన నిజమైన బాధితుల కథనాల డాక్యుమెంటరీలను ప్రదర్శించి అవగాహన పరిచారు. ప్రజ్వల రాష్ట్ర సమన్వయకర్త వై.చంద్రయ్య, సూపర్‌వైజర్లు శ్రీ లత, సత్యవతి, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్రావ్య శృతి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


పునాదిపాడులో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న ప్రతినిధులు

కంకిపాడు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఓడీఎఫ్ ప్లస్ బృంద ప్రతినిధులు స్పష్టంచేశారు. మండలంలోని పునాదిపాడు, కాసరనేనివారిపాలెం, చలివేంద్రపాలెం గ్రామాల్లో ఓడీఎఫ్ ప్లస్ బృందాలు పర్యటించాయి. రీడ్స్ ఆర్గనైజేషన్ భాగస్వామ్యంతో సూపర్‌వైజర్లు ఎస్.జయకుమారి, సుజాత ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి తనిఖీ చేశారు. బహిరంగ మల విసర్జన నిషేధం అమలు వివరాలను సేకరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, మరుగుదొడ్ల నిర్వహణ తీరు పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, నాణ్యత తనిఖీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంతో పాటుగా, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓ బి.వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్ బాబు

పెనమలూరు: వినియోగదారులు హక్కుల పై అవగాహన ఉండాలని కానూరు సిద్ధార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్ బాబు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కాలేజీలో బుధవారం ఏపీ డిపార్టుమెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ సహకారంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన లేదన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారుల చట్టంపై అవగాహన లేక మోసపోతున్నారని తెలిపారు. వినియోగదారుల రక్షణ చట్టం–2019ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. వినియోగదారుల హక్కులకు భంగం కలిగితే దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా భంగం కలిగినట్లేనన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు యూత్ సర్వీసెస్ అసిస్టెంట్ మేనేజర్ నిమ్మగడ్డ నాగేశ్వరరావు బహుమతులు అందచేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు కార్డు అనుసంధానం పూర్తి చేయండి


మాట్లాడుతున్న తహసీల్దార్ పి.జాహ్నవి

విజయవాడ రూరల్: ఈ నెలాఖరునాటికి ఓటరు కార్డుకు గుర్తింపు కార్డు అనుసంధానం నూరుశాతం పూర్తి చేయాలని సహాయ ఎన్నికల అధికారి, మండల తహసీల్దార్ పి.జాహ్నవి ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత సంవత్సరం ఆగష్టు 1వ తేదీ నుంచి ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసే కార్యక్రమం జరుగుతుందన్నారు. అయినా మండలంలో ఆశాంచిన మేర పూర్తి కాలేదని పేర్కొన్నారు. అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎంపీడీఓ బి.భార్గవి మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో 80 శాతం, గన్నవరం నియోజకవర్గంలో కేవలం 66 శాతం మాత్రమే అనుసంధానం చేశారన్నారు. ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దార్ ఎ.గోపాలరెడ్డి మాట్లాడుతూ ఓటరు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, గ్యాస్ కార్డు, కరెంటు బిల్లు, బ్యాంక్ పుస్తకం, డ్రైవింగ్, ఉపాధి పథకం కార్డు ఏదైనా నివాస గుర్తింపు కార్డుతో అను సంధానం చేయవచ్చన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీపీ సరోజిని, ఎంపీడీఓ

ఉంగుటూరు: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. పెద అవుటపల్లి రామకృష్ణాపురం ఎంపీపీ పాఠశాలలో నాడు– నేడు ద్వారా రూ.21 లక్షల అంచనాలతో నిర్మాణం చేపట్టనున్న అదనపు తరగతి గదుల భవనాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపవుట్ రేటు తగ్గించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఎస్ఎస్ ఏఈ జి.రాజు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ స్వప్న, హెచ్ఎం టి.శాంతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరువచేద్దాం


సచివాలయం కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో శివకుమార్, నాయకులు

గన్నవరం రూరల్: మండలంలోని కొత్తగూడెం గ్రామంలో బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ సచివాలయం కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం మండల కన్వీనర్ కైలే శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పటిష్టంగా పని చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, నాయకులు పడమట సురేష్, సర్పంచ్ టి.రాంబాబు, నాయకులు గోపాలరావు, మోహనరావు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

తెంపల్లి గ్రామంలో..

మండలంలోని తెంపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం మండల జగనన్న సచివాలయం కన్వీనర్‌లు, గృహసారథుల కన్వీనర్ కైలే శివకుమార్ అధ్యక్షతన జరిగింది. పాల్గొన్న కన్వీనర్‌లు, గృహసారథులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ బాగుండాలి అంటే మళ్లీ మనమందరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి బాసటగా నిలిచి 2024లో ముఖ్యమంత్రి చేయాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు మరింతగా ప్రజలకు అందించాలన్నారు. సర్పంచ్ కొలుసు శిరీషా, గ్రామ పార్టీ కన్వీనర్ కొలుసు చిదంబర్ కుమార్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి నాగనబోయిన గిరీష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

పెనమలూరు: డిగ్రీ చదువుతున్న విద్యార్థిని అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి సాలిపేట బాలాజీనగర్‌కు చెందిన కందుల శ్రీనివాసరావు కుమార్తె (19) విజయవాడలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. ఆమె ఈ నెల 14వ తేదీన కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

కంకిపాడు: మైనరు బాలిక అదృశ్యమైన సంఘటనపై కంకిపాడు పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు..కంకిపాడు పట్టణానికి చెందిన మైనరు బాలిక (15) ఈనెల 14వ తేదీ నుంచి కనిపించటం లేదు. ఈ మేరకు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

సినీరంగ ధ్రువతార మహానటి సావిత్రి

సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి


సుధాశ్రీనివాస్ సత్కార సభలో విజయ చాముండేశ్వరి, రమాసత్యనారాయణ

విజయవాడ కల్చరల్: తెలుగు సినీరంగ ధ్రువతార మహానటి సావిత్రి అని మహానటి సావిత్రి కుమార్తె విజయచాముండేశ్వరి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం, సినీనటి సావిత్రి స్ఫూర్తి సభ, సినీ సంగీత విభావరి, అంతర్జాతీయ గాయని సుధా శ్రీనివాస్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయచాముండేశ్వరి మాట్లాడుతూ మహానటి పేరుతో 16 సంవత్సరాలుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంక్షేమ సంఘం సేవలను అభినందించారు. సినీ దిగ్గజం దాసరి నారాయణరావు సావిత్రి పేరుతో కళాపీఠం స్థాపించాలని భావించారని, వారి కోరికను పరుచూరివిజయలక్ష్మి సాకారం చేశారన్నారు. శాతవాహనా కళాశాల కరస్పాండెట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడారు. సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు విజయలక్ష్మి సంస్థ లక్ష్యాలను వివరించారు. అంతర్జాతీయ గాయని సుధాశ్రీనివాస్‌నుఆత్మీయంగాసత్కరించారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకులు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి,జ్యోతిష్యశాస్త్రవేత్త ప్రసూనా రామన్ పాల్గొన్నారు.

నాటక పోటీల్లో విజయవాడ డివిజన్‌కు ద్వితీయ స్థానం


రైల్ కోచ్ ఫ్యాక్టరీ జీఎం నుంచి అవార్డు అందుకుంటున్న విజయవాడ డివిజన్ ఉద్యోగులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పంజాబ్ రాష్ట్రంలోని కపుర్తలలోని రైల్ కోచ్ ఫ్యాక్టరీలో ఈ నెల 14న నిర్వహించిన ఆల్ ఇండియా రైల్వే హిందీ కాంపిటిషన్–2022లో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ప్రదర్శించిన 'పిపీలికా' నాటకం ద్వితీయ స్థానం సాధించింది. దీంతో పాటుగా బెస్ట్ మేకప్, బెస్ట్ మ్యూజిక్, బెస్ట్ స్టేజ్ సెట్టింగ్ అవార్డులు కూడా దక్కించుకుంది. ఈ మేరకు బుధవారం రాత్రి నాటక రచయిత ఎంఎస్ చౌదరి, రాజభాష అధికారి ఆశామహేష్‌కుమార్, నాటక బృంద సభ్యులు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ జీఎం ఆషేష్ అగర్వాల్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ మేరకు విజయవాడ రైల్వే డీఆర్ఎం షివేంద్రమోహన్, ఏడీఆర్‌లు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్ నాటక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం షివేంద్రమోహన్ మాట్లాడుతూ ఎంఎస్ చౌదరి నాటకాన్ని తెలుగులో రచించగా దాన్ని రాజభాష అధికారి ఆశామహేష్‌కుమార్ హిందీలోకి అనువాదం చేసి ఆదరణ పొందారన్నారు. అందులో ప్రధాన పాత్రలో ఎం.గోపాలకృష్ణతో పాటు వివిధ విభాగాల నుంచి 14 మంది అద్భుతంగా నటించి జాతీయ స్థాయిలో డివిజన్‌కు పేరుప్రఖ్యాతలు తీసుకురావడం సంతోషంగా ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎన్‌పీఎస్‌పై అవగాహన శిబిరం


మాట్లాడుతున్న సీనియర్ డీపీఓ బాలమురళీధర్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని రైల్వే ఆడిటోరియంలో బుధవారం నేషనల్ పెన్షన్ సిస్టం (ఎన్‌పీఎస్) క్యాంప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ డీపీఓ ఎం.బాలమురళీధర్ పాల్గొని ఎన్‌పీఎస్‌పై ఉద్యోగులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎన్‌పీఎస్‌లో విజయవాడ డివిజన్‌లోని 167 మంది ఉద్యోగులు పాల్గొని ఎన్‌పీఎస్ కొత్త రిజిస్ట్రేషన్లు, వివరాల్లోని మార్పుచేర్పులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌పీఎస్‌పై అవగాహన విస్తృతపరిచేందుకు, డివిజన్ వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు ఇటువంటి అవగాహన శిబిరాలను క్రమంతప్పకుండా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ కె.శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.